
# ప్రజాశక్తి

బుధవారం 22 అక్టోబర్ 2025

5

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



## రెవెన్యూ సమస్యలకు పరిష్కారం



**ప్రజాశక్తి- కందుకూరు :** పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఉదయం కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు మండల రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన రెవెన్యూ సమస్యలను త్వరగా పరిష్కరించాలని, ఎక్కువ రోజులు ప్రజలను ఆఫీసు చుట్టూ తిప్పుకోకుండా పనులు చేయాలని అధికారులు సూచించారు.ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లను త్వరగా మంజూరు చేయాలని తెలిపారు. మండల రెవెన్యూ సర్వేయర్, వీఆర్వోలు, మండల పార్టీ అధ్యక్షులు బుస్సారెడ్డి కష్టారెడ్డి, మండలంలోని అన్ని గ్రామ పార్టీ అధ్యక్షులు పార్టీ నాయకులు రైతులు పాల్గొన్నారు.

**బంగాళఖాతంలో అల్పపీడనం కారణంగా రెండు రోజులుగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి...నేడు, రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది.కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు.. నేడు పాఠశాలలకు సెలవు ప్రకటించారు..సోమశిలలో 70.2 టిఎంసిల నిల్వ ఉంది. ప్రాజెక్టులోకి 20 వేల క్యూసెక్కుల నీరు వస్తుండగా, 35 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.. ఇందుకోసం రెండు గేట్లు ఎత్తివేశారు.. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు..**

# భారీ వర్షాలకు అధికారులు అప్రమత్తం..!

- -సోమశిల రెండు గేట్లు ఎత్తివేత
- -35 వేల క్యూసెక్కులు విడుదల
- -జిల్లాలో విస్తారంగా వర్షాలు
- -నేడు విద్యా సంస్థలకు సెలవు
- -కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు



అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

**ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి**

జిల్లా వ్యాపితంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపధ్యంలో రెవెన్యూ, పోలీసు యంత్రాంగం పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో భారీవర్షాలపై మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్సు సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున, యంత్రాంగం ఎటువంటి ఇబ్బందులనైనా ఎదుర్కొనేందుకు పూర్తి సన్నద్ధతతో ఉండాలని సూచించారు. లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. తీరప్రాంత ప్రజలు, మత్స్యకారులను అప్రమత్తం చేస్తూ ఎవరూ సముద్రంలోనికి వెళ్లకుండా తగిన హెచ్చరికలు జారీ చేయాలన్నారు. సోమశిల ప్రాజెక్టు పరివాహక ప్రాంతాల్లో రెవెన్యూ, పోలీసు అధికారులు గట్టి నిఘా ఏర్పాటు చేయాలన్నారు. అత్యవసర సమయాల్లో ప్రజలకు అందించేందుకు బియ్యం, సరుకులు అందించేందుకు పౌరసరఫరాల శాఖ సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి వర్ష ముప్పును ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలని ఆదేశించారు.నీట మునిగిన పంట పొలాల వివరాలను సేకరించి ప్రాథమిక నివేదిక సిద్ధం చేయాలని వ్యవసాయాధికారులను కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆదేశించారు. ఏయే ప్రాంతాల్లో పంట పొలాలు ఎంతమేర నీటమునిగినాయో క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదికలు అందించాలని సూచించారు. నేడు అన్ని ప్రభుత్వ, ప్రయివేట్, ఎయిడెడ్ పాఠశాలలు, అంగన్‌వాడీ పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ఈ ఉత్తర్వులను అన్ని రకాల పాఠశాలల యాజమాన్యాలు విధిగా అమలుచేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంను ఏర్పాటుచేశారు. 0861 2331261, 7995576699 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు.

**35 వేల క్యూసెక్కులు విడుదల**

సోమశిలలోని రెండు గేట్లను అధికారులు ఎత్తివేశారు. పైన కురుస్తోన్న వర్షాల కారణంగా 20 వేల క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి చేరుతోంది. రెండు రోజుల క్రితం 74 టీఎంసిల నీటి నిల్వలు ఉండగా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా 35 వేల క్యూసెక్కుల నీరు కిందకు విడుదల చేస్తున్నారు. పెన్నా పరివాహక ప్రాంతం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. మరో మూడు రోజులు వర్షాలు ఉన్నందున ఎప్పుడైనా సమస్య రాకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు...



పోలీస్ అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్‌పి అజిత వేజెండ్ల

# పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి

## కలెక్టర్ హిమాన్షు శుక్లా

**ప్రజాశక్తి-నెల్లూరు**

ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రజల భద్రతే లక్ష్యంగా విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమర వీరుల త్యాగాలు మరువలేనివని కలెక్టర్ హిమాన్షు శుక్ల అన్నారు.మంగళవారం నగరంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్ లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఎస్‌పి డాక్టర్ అజిత వేజెండ్ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత సంస్మరణ స్తూపం వద్ద విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసులకు కలెక్టర్, ఎస్‌పి, అమరవీరుల కుటుంబసభ్యులు పోలీసు లాంఛనాలతో ఘన నివాళి అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తరపున చెక్కులు అందించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ 1959వ సంవత్సరం అక్టోబరు 21వ తేదీ జమ్మూ కాశ్మీర్‌లోని హిమాలయ పర్వత శ్రేణుల్లో మనదేశ సరిహద్దు అయిన లదాక్ భూ భాగంలోకి చైనా దురాక్రమణకు పాల్పడిన సమయంలో వీరోచితంగా పోరాడి అసువులు బాసిన వీర జవాన్లకు నివాళిగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21 న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. 2024 సెప్టెంబర్ 1 నుండి 2025 అక్టోబర్ 1 వరకు దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో 191 మంది పోలీసులు ప్రాణత్యాగం చేశారన్నారు. జిల్లాలో 10 మంది పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించారన్నారు.

**ప్రజల రక్షణకు అహర్నిశలు కృషి : ఎస్‌పి**

నగరంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్ లో నిర్వహించిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమంలో ఎస్‌పి డాక్టర్ అజిత వేజెండ్ల మాట్లాడుతూ దేశ స్వేచ్ఛగా, స్వాతంత్ర్యంగా ఉండడానికి పోలీసులు విరోచిత పోరాటాలే కారణమన్నారు. ఎంటీవో ఆర్‌ఐ హరిబాబు ఆధ్వర్యంలో పోలీసులు తమ కవాతు నిర్వహించారు.కెవిఆర్ పెట్రోలు బంకు వరకు నిర్వహించిన చిన రాలీ, మానవ హారంలోకలెక్టర్, ఎస్‌పి పాల్గొన్నారు. అడిషనల్ ఎస్‌పి సిహెచ్ సౌజన్య, డిఎస్‌పిలు ఘట్టమనేని శ్రీనివాసరావు, శ్రీనివాస రావు, శ్రీధర్, వేణుగోపాల్, రామారావు, చంద్రమోహన్, ఏవో చంద్రమౌళి, ఎస్‌బి, రూరల్, కావలి, ఆత్మకూరు, మహిళా పోలీస్ స్టేషన్, ఎఆర్, సర్కిల్ ఇన్స్పెక్టర్స్, ఎఐ, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

**రేషన్ బియ్యం మాఫియా వ్యవహారం జిల్లా వ్యాపితంగా సంచలనం కలిగించింది.. .అధికారపార్టీ నేతలే ఈ వ్యవహారాన్ని బయటపెట్టిన విషయం తెలిసిందే... పేదలకు చెందిన రేషన్‌బియ్యం కొందరు వ్యక్తులు అడ్డదారిలో సరిహద్దులు దాటిస్తున్న విషయం తెలిసిందే.. ఈ విషయం బయటకు రావడంతో ప్రభుత్వం మాఫియాను కట్టడి చేస్తుందని అందరూ బావించారు...సివిల్ సప్లయ్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందజేశారు.. అసల విషయం పక్కన పెట్టిన ప్రభుత్వం ఈ విషయాలపై విమర్శలు చేస్తున్న టిడిపి నేత నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆరోపణలు ఎదుర్కొంటున్న సివిల్ సప్లయ్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాబిరామిరెడ్డిని పిలిచి సర్దుబాటు చేశారు..**

# రేషన్ మాఫియా సర్దుబాటు..?

## టిడిపి నేతలకు నచ్చచెప్పిన అధిష్టానం - అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందజేత

**ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి**

రేషన్ బియ్యం అక్రమ రవాణా విషయంలో ప్రభుత్వం సర్దుబాటు ధోరణిలో వ్యవహరించిందనే విమర్శలు ఎదుర్కొంటుంది. ఎప్పటి నుంచో పిడిఎస్ బియ్యం మాఫియా భారీగా బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి, సరిహద్దులు దాటిస్తోంది..ఇటీవల నెల్లూరు నగరంలో 1800 కిట్వాళ్ల తరలిస్తున్న ఐదు లారీలను సివిల్ సప్లయ్ అధికారులు పట్టుకోవడంతో విషయం పెద్దగా మారింది. ఈ అంశంలో జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు ఇప్పటికే ఆ శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఉన్నతాధికారులను కలిసి స్వయంగా నివేదిక అందజేశారు.. జిల్లా వ్యాపితంగా ఏయే ప్రాంతాల్లో మాఫియా సాగుతోంది.? ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏమిటి,? ఉధృతం కాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి? అనే విషయాలను నివేదిక రూపంలో ఇచ్చినట్లు సమా చారం. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మీడియా సమావేశంలో పూర్తి అధారాలు తన వద్ద ఉన్నాయని, అధికారపార్టీనేత ఒకరు చేస్తున్నారని, ఆశాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మౌనంగా ఉన్నారని, స్పందించాలని కోరారు..



కోటంరెడ్డి, వేమిరెడ్డి మధ్య సర్దుబాటు చేస్తున్న టిడిపి అగ్రనేతలు (ఫైల్)

**టిడిపి నేతల మధ్యసర్దుబాట్లు..?**

రేషన్ మాఫియా విషయంలో ప్రభుత్వానికి చెడ్డపేరు విషయం పక్కన పెట్టి, టిడిపి పార్టీ నేతల మధ్య సర్దుబాటు చేశారు. కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వేమిరెడ్డి పట్టాబిరామిరెడ్డిలను రాజధాని పార్టీ కార్యాలయానికి పిలిపించి ఆపార్టీ రాష్ట్ర అధ్యకులు పి. శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ మాట్లాడారు. రేషన్ బియ్యం మాట్లాడకుండా పార్టీకి చెడ్డపేరు వస్తుందని, విమర్శలు చేసుకోవద్దని సర్దుబాటు చేసినట్లు తెలిసింది. తనకు అవకాశం ఇస్తే మొత్తం ఆధారాలతో బయటపెడతానని, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మీడియా ముందు పెట్టారు. గత వైసిపి ప్రభుత్వం రేషన్ బియ్యం దందా రెచ్చిపోయింది. ఇప్పుడైనా దానిని కట్టడిచేసి పేద ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తారని అందరూ ఆశించారు. ఏలాంటి నిర్ణయమూ లేకుండానే సమావేశం ముగిసింది. వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి తనకు బియ్యానికి ఏం సంబందం లేదని, కావాలనే విమర్శలు చేస్తున్నారని సమావేశంలో చెప్పినట్లు తెలిసింది.

## చింతారెడ్డిపాళెం జంక్షన్ వద్ద

# అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించాలి

**ప్రజాశక్తి-నెల్లూరు :**మెడికవర్ వైద్యశాల, చింతారెడ్డి పాళెం జంక్షన్ ప్రాంతంలోని మినీ బైపాస్ రోడ్డుకు అండర్ పాస్ బ్రిడ్జి (ఫ్లైఓవర్ బ్రిడ్జి) నిర్మించి స్థానిక ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని ఫ్లై ఓవర్ సాధన కమిటీ కన్వీనర్ ఆర్ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక చిల్డ్రన్స్ పార్కు సమీపంలో ఫ్లై ఓవర్ సాధన కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెడికవర్ వైద్యశాల యాజమాన్యం ప్రతినిధిగా రంజిత్ రెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజల ప్రాణాల రక్షణ నిమిత్తం ఈ ప్రాంతంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి, లేదా అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాల్సిన అవసరముందన్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణం కోసం సాధన కమిటీ చేసే పోరాటానికి తమ వైద్యశాల యాజమాన్యం సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. ఫ్లై ఓవర్ సాధన కమిటీ కన్వీనర్ ఆర్ శ్రీనివాసులు, కో కన్వీనర్ కొట్టె రామ్మూర్తి మాట్లాడుతూ చిల్డ్రన్స్ పార్కు నుంచి చింతారెడ్డి పాళెం వేళ్లే మార్గంలో ఉన్న జాతీయ రహదారికి అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలని పోరాటం చేసినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడం దారుణమన్నారు. ఫ్లై ఓవర్, అండర్ పాస్ బ్రిడ్జి సాధన కోసం కమిటీ చేసే పోరాటాలకు, ఉద్యమాలకు మెడికవర్ యాజమాన్యం సంపూర్ణ మద్దతు ప్రకటించడం సంతోషకరమన్నారు. గురుబ్రహ్మం, శివకుమార్‌రెడ్డి, జనార్ధన్, శంకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్ శ్రీనివాసులు

## విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

**ప్రజాశక్తి -వలేటివారిపాలెం :**మండలంలోని లింగపాలెం, రోళ్ల పాడు, బంగారక్కపాలెం, కాకర్ల వారిపాలెం, కళ్లవళ్ల గ్రామాల్లోని ప్రభుత్వపాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు లింగపాలెం స్మార్ట్ విలేజ్ డెవలప్మెంట్ పోర్స్ సంస్థ వ్యవస్థాపకులు గొర్రెపాటి రాజాబాబు మంగళవారం పలకలు, నోట పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. లింగపాలెం జనరల్ స్కూల్లో 24 మంది విద్యార్థులకు, రోళ్లపాడు ఎంపీపీ స్కూల్లో 11 మంది విద్యార్థులకు, కళవళ్ల ఎంపీపీ స్కూల్లో 54 మంది విద్యార్థులకు, బంగారక్కపాలెం ఎంపిపి స్కూల్లో 22 మంది విద్యార్థదలకు, కాకర్లవారిపాలెం ఎంపీపీ స్కూల్లో 28 మంది విద్యా ర్థులకు పంపిణీ చేశారు. దాత రాజాబాబును టీచర్లు, గ్రామస్తులు సత్కరించారు. రంగనాద్, గ్రామస్తులు గొర్రెపాటి మాధవరావు ఉన్నారు.



## రహదారి అస్తవ్యస్తం

**ప్రజాశక్తి - వలేటివారిపాలెం :**మండలంలోని చుండి అయ్యవారిపల్లెలో రోడ్ల పై వర్షపు నీరు ఎక్కడికక్కడే భారీగా నిలిచిపోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయ్య వారిపల్లె దళిత కాలనీకి వెళ్లే రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోవడంతో ఆ రోడ్డుకు వెళ్లాలంటేనే ప్రజలు భయపడి పోతున్నారు. రోడ్డు అంతా వర్షపు నీరు నిలిచి పోవడంతో ప్రజలు రోడ్డు మార్జిన్ తెలియక అటుగా వచ్చి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజల బాధలు మరింత వర్ణనాతీతంగా ఉన్నాయి. ఈ రోడ్డు విషయమై అనేకసార్లు స్థానిక సచివాలయంలో అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడంలేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై అయ్యవారిపల్లె పంచాయతీ కార్యదర్శి ఎం గణేష్ ను వివరణ కోరేందుకు కు ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.



## విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

**ప్రజాశక్తి-కందుకూరు :** కందుకూరులో దీపావళి పండుగ వేళ విషాదం చోటుచేసుకుంది. కందుకూరుకి చెందిన ఎలక్ట్రిషియన్ నజీర్ (38) కరెంట్ షాక్‌తో మతి చెందాడు. ఉప్పుచెరువు సమీపంలోని మహబూబ్ నగర్ నుంచి బోడపాటివారి కొష్టాలుకు మంచినీటి సరఫరా జరుగుతుంది.ఆ స్కీంలో విద్యుత్ సమస్య తలెత్తడంతో మరమ్మతు పనులు చేసేందుకు వెళ్లిన నజీర్ కరెంట్ షాక్కు గురైనట్లు సమాచారం అందటంతో హుటాహుటిన నజీర్‌ను కందుకూరు ఏరియా హాస్పిటల్‌కి తరలించారు. అప్పటికె నజీర్ మరణిచాడు.నజీర్ చనిపోయే ముందు తన కుమారుడితో ఫోన్లో మాట్లాడినట్టు సమాచారం. దీపావళి పండుగకి టపాసులు కొనివ్వాలని కుమారుడు ఫోన్లో అడిగితే.. 'నేను రాలేను నువ్వే వెళ్లి కొనుక్కో' అంటూ నజీర్ ఫోన్ పేలోడబ్బు పంపారు.ఇది జరిగిన కాసేపటికే ఆయన చనిపోయాడని తెలియడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

## లక్ష్మినాయుడు కుటుంబాన్ని ఆదుకోవాలి : వైసిపి

**ప్రజాశక్తి-కందుకూరు :**కందుకూరు నియోజకవర్గం గుడ్లూరు మండలం దారకానిపాడు గ్రామంలో తిరుమల శెట్టి లక్ష్మీనాయుడు దారుణంగా హత్యకు గురయ్యాడని, ఆ కుటుంబానికి ప్రభుత్వపరంగా కోటి రూపా యలు ఆర్థిక సాయం అందించాలని పొన్నూరు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి అంబటి మురళి డిమాండ్ చేశారు. మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించడానికి దారకానిపాడు వెళ్లడానికి ప్రయ త్నించగా పోలీసులు అడ్డుకున్నారు. తాము హత్యకు గురైన లక్ష్మయ్య నాయుడు భార్యను ,కుటుంబ సభ్యులను పరామర్శించడానికి వచ్చామని, రాజకీయం చేయడానికి రాలేదని అంబటి మురళి తోపాటు కాపు సంఘం నాయకులు పోలీసులను కోరిన వారు దారకంపాడు వెళ్లడానికి అను మతించలేదు.దీంతో వెన్ను తిరిగి కందుకూరు వైసిపి కార్యాల యానికి చేరుకున్నారు. అక్కడ విలేకర్లతో మాట్లాడారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జోక్యం చేసుకుని హత్యకు గురైన లక్ష్మయ్య నాయుడు కుటుం బానికి కోటి రూపాయలు ఆర్థిక సాయం ప్రభుత్వం నుండి అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పలువురు కాపు నాయకులు ఉన్నారు.



మాట్లాడుతున్న అంబటి మురళి

# రైతులపై భారాలు మోపొద్దు

## ఎరువులకు రాయితీ ప్రకటించాలి - రైతు సంఘాలు డిమాండ్

**ప్రజాశక్తి-నెల్లూరు :**ఎరువుల ధరలు పెంచి రైతులపై భారాలు వేయొద్దని, కేంద్ర ప్రభుత్వం ఎరువుల ధరలపై రాయితీ ప్రకటించాలని ఏపి రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు ప్రభుత్వాలను డిమాండ్ చేశాయి. . స్థానిక రామచంద్రారెడ్డి భవన్‌లో ఎపి రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు సమావేశమయ్యాయి. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు విలేకర్లతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఎరువులపై సబ్సిడీ తగ్గించి వేయడంతో ఆ మేరకు ఆయా కంపెనీలు ధరలు పెంచి రైతులపై ఆర్థిక భారాలు మోపేందుకు సిద్ధపడుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో కాంప్లెక్స్ ఎరువు 50 కేజీల బస్తాపై రూ.50ల నుంచి వంద రూపాయల వరకు పెంచే అవకాశం ఉందన్నారు. ప్రధాని ఒక ప్రక్క జిఎస్‌టి తగ్గించాము.. అన్ని రకాల వస్తువులపై ధరలు తగ్గాయని, దీపావళి పండుగ ముందుగానే చేసుకోవాలని ఆర్భాటంగా ప్రకటనలు చేస్తు ప్రచారం చేస్తున్నారన్నారు. ఎరువులపై 18 శాతం జిఎస్‌టి విధించేవారిమని, దానిని 5 శాతానికి తగ్గించామంటూ ఊకదంపుడు మాటలు చెబుతున్నారన్నారు. జిఎస్‌టి పన్ను రాయితీ రైతులకు కాకుండా ఎరువులు తయారు చేస్తున్న కంపెనీలకు ప్రయోజనం చేకూరే విధంగా ఉందన్నారు. జిఎస్‌టి పన్నుల రాయితీల ప్రయోజనం రైతులకు దక్కే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఎరువుల ధర రూపంలో సుమారుగా రూ. 300 కోట్లు మేరకు ఆంధ్ర రాష్ట్రంలోని రైతులపై అధనపు భారం పడుతుందన్నారు. ఇప్పటికే రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర లభించకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఆర్థిక ఇబ్బందులతో రైతులు సతమతమౌతుంటే కేంద్రం తీసుకున్న నిర్ణయం వల్ల రైతులపై మరింత ఆర్థిక భారం పడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల మూలిగే నక్క మీద తాటికాయ పడినట్లు అన్న చందంగా ఉందన్నారు. ప్రభుత్వాలు స్పందించి రైతులపై ఆర్థిక భారాలు మోపకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఏపి రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయన్నారు. ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పి.జనార్ధన్, కార్యదర్శి మూలి వెంగయ్య, ఏపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తుళ్లూరు గోపాల్, ఎం.రామచంద్రయ్య, ఏపి వ్యవసాయ కార్మిక సంగం జిల్లా అధ్యక్ష. కార్యదర్శులు జొన్నలగడ్డ వెంకమరాజు, ఎం.పుల్లయ్య ఉన్నారు.




మాట్లాడుతున్న రైతు సంఘాల నాయకులు

# ఎల్ఐసి 'ఎఓఐ'నూతన కమిటీ ఎన్నిక

**ప్రజాశక్తి కందుకూరు)**

ఎల్ఐసి ఏజెంట్స్ యూనియన్ ఎఒఐ (సిఐటియు) నెల్లూరు డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సిహెచ్. నరసింహారావు, బి.వెంకట్రావు కోశాధికారిగా సిహెచ్ మాలకొండయ్య లను ఆదివారం కందుకూరులో జరిగిన యూనియన్ 6వ నెల్లూరు డివిజన్ మహాసభలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితోపాటు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డి శ్రీనివాసులు ,ఉపాధ్యక్షులుగా జి.ధనుంజయ, కె.వెంకటేశ్వర్లు, బి.మధుసూదనరావు, సహాయ కార్యదర్శులుగా ఆర్.హజరత్ రెడ్డి,యస్.శ్రీనివాసులు, పి.ఆంజనేయులు, కమిటీ సభ్యులుగా యస్ఎ.బషీర్ ,నర్రావెంకటేశ్వర రెడ్డి, వై.వి.కష్ణయ్య,యం.నర్సయ్య, కె.వెంకటేశ్వర రెడ్డి, యస్.రమణి, కె.వి.శేషమ్మ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎల్ ఐ సి ని కాపాడేందుకు ఏజెంట్లను రక్షించేందుకు మహాసభ 14 తీర్మానాలను మహాసభ ఆమోదించినట్లు యూనియన్ ప్రధాన కార్యదర్శి బి వెంకట్రావు మంగళవారం తెలిపారు.ఇన్సూరెన్స్ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పెంపు నిర్ణయాన్ని విరమించుకోవాలని,ఏజెంట్ గ్రూప్ ఇన్సూరెన్స్50 లక్షలకు పెంచాలని వయసుతో సంబంధం లేకుండా ఏజెన్సీ అమలులో ఉన్నంతకాలం గ్రూప్ ఇన్సూరెన్స్ ఇవ్వాలి. క్లబ్ తో సంబంధం లేకుండా ఏజెంట్లు అందరికీ, వారి కుటుంబ సభ్యులకు మెడిక్లెయిమ్ సౌకర్యం కల్పించాలి, ఏజెంట్ల కమిషన్ పాత విధానాన్ని అమలు తదితరల తీర్మానాలు చేసినట్లు తెలిపారు.



ఎల్ఐసి ఎఒఐ అధ్యక్షులు సిహెచ్ నరసింహారావు



ఎల్ఐసి ఎఒఐ ప్రధాన కార్యదర్శి బి వెంకట్రావు

# మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ దారుణం

**ప్రజాశక్తి -వలేటివారిపాలెం**

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ సిగ్గుచేటని మండల వైసిపి కన్వీనర్ అనుమోల లక్ష్మీనరసింహం తెలిపారు.మండలంలోని అంకభూ పాలవరం, పోలి నేనిచెరువు గ్రామాల్లో మంగళవారం మెడికల్ కాలేజీలు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా రచ్చబండ, కోటి సంతకాలు సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా రచ్చబండ, కోటి సంతకాలు సేకరణ కార్యక్రమం జరిగింది.అందులో భాగంగా సంతకాలు చేయించారు. మండల వైసీపీ కన్వీనర్ లక్ష్మీనరసిం హం మాట్లాడారు. మండల వైసీపీ కన్వీనర్ అనుమోల లక్ష్మీనరసిం హం, పొట్టేళ్ల క్రిష్ణయ్య, గుత్తా గోపి, కట్టా హనుమంతరావు, చింతలపూడి రవీంద్ర, ఇరపని అంజయ్య, మర్రి అంజయ్య, ప్రగడ సుధాకర్ పాల్గొన్నారు.

**గుడ్లూరు రూరల్ :** గుడ్లూరు మండలం మండలంలోని దారకానిపాడు పంచాయతీ లో వైసిపి మండల కమిటీ ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సమీకరణ కార్యక్రమం జరిగింది. రచ్చబండ, మండల, గ్రామ పార్టీకి సంబంధించిన వివిధ విభాగాల కమిటీలను ఎన్నుకున్నారు. ఈ ఈ కార్యక్రమం లో గుడ్లూరు ఎంపిపి పులి రమేష్, వైస్ ఎంపిపి శ్రీరాములు,జిల్లా ఉపాధ్యక్షులు బిల్లా రమణయ్య,నియోజకవర్గం ప్రచార కమిటీ అధ్యక్షులు గొర్ల రమేష్,ఈర్ల వెంకటేశ్వర్లు, నియోజకవర్గం స్టూడెంట్ వింగ్ అధ్యక్షులు కర్పూరపు అశోక్,నియోజకవర్గం సోషల్ మీడియా ఇంచార్జ్ కాపులూరి మధు సూదన్,మండల ఉపాధ్య క్షులు కాట్రగడ్డ వెంకట్రావు, గనిపినేని వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రచారకమిటి చెరు కూరి బ్రాహ్మయ్య, దారకానిపాడు నాయకులు సర్పంచ్ చిత్తరి మాధవరావు, యరగర్ల నరసింహారావు, పల్లాపాటి వెంకటేష్ ఉన్నారు.

**కందుకూరు :**మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా రచ్చబండ ,కోటి సంతకాల సేకరణ కార్యక్రమం మండలంలోని పలుకూరు పంచాయతీలో మంగళవారం జరిగింది. కందుకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ ఆదేశాలతో పలుకూరు గ్రామంలో గ్రామంలోని ప్రజలకు మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేస్తే కలిగే నష్టాలను గురించి వివరిస్తూ, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కందుకూరు మండల పార్టీ అధ్యక్షుడు ఈదర రమేషే మాట్లాడారు.



వలేటివారిపాలెంలో..

## విద్యుత్ సిబ్బందికి సెలవులు రద్దు

**ప్రజాశక్తి-నెల్లూరు :**తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్ సిబ్బంది సెలవులు రద్దు చేశామని, ప్రతి ఒక్క ఉద్యోగి వారికి నిర్దేశించిన హెడ్ క్వార్టర్ లోనే ఉండాలని, జిల్లాలోని 5 డివిజన్లో ,విద్యుత్ భవన్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ కె.రాఘవేంద్రం పేర్కొన్నారు. మంగళవారం విద్యుత్తు భవన్‌లోని ఎస్ఈ ఛాంబర్ నుంచి జిల్లాలోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్,అసిస్టెంట్ ఇంజనీర్స్ తో టెలికాన్ఫెరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్తు సబ్‌స్టేషన్లలో విద్యుత్ స్తంభాలు అందుబాటులో ఉంచుకోవాలని సివిల్ విభాగం వారికి ఆదేశాలు జారీ చేశారు.

## ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి

**ప్రజాశక్తి-కందుకూరు :**ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ప్రకాశం జిల్లా కోశాధికారిగా కందుకూరు చెందిన రవ్వా శ్రీనివాసులు మంగళవారం మంగళగిరిలో పీకే కళ్యాణ మండపంలో ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు.రవ్వా శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ చైర్మన్ మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్, గ్లోబల్ అధ్యక్షుడు టంగుటూరి రామకష్ణ,రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖమంత్రి టీ.జీభరత్,రాష్ట్ర అధ్యక్షుడు దేవతి భగవన్నారాయణ,చీఫ్ అడ్వైజర్ శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు దేవకి వెంకటేశ్వర్లు, నేషనల్ కోఆర్డినేటర్ ఇల్లూరి లక్ష్మయ్య, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కనమర్లపూడి హరిప్రసాద్, కోశాధికారి నూకల సాంబశివరావు,అదనపు ప్రధాన కార్యదర్శి మాజేటి సూర్య వేణుగోపాలకష్ణ లకు కతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్,ఏపీ ఆర్యవైశ్య మహాసభ గౌరవ అధ్యక్షులు పెనుగొండ సుబ్బరాయుడు, అంబికా కృష్ణ పాల్గొన్నారు.

## కందుకూరులో భారీ వర్షం

**ప్రజాశక్తి-కందుకూరు :**కందుకూరు ప్రాంతంలో మంగళవారం భారీ వర్షం కురిసింది.రోడ్డపై నీరు ప్రవహించింది.కందుకూరు పట్టణంలోని లోతట్టు ప్రాంతాలన్ని జలమయమయ్యాయి.ఈక్రమంలో ముత్యాలగుంట పార్కు సమీపంలో రోడ్డుపై మంగళవారం మధ్యాహ్నం చెట్టు వేళ్లతో సహా కూలి అడ్డంగా పడిపోయింది.ఆ సమయంలో రోడ్డు కింద ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఒక్కసారిగా చెట్టు కూలడంతో ప్రజలు భయాం దోళనకు గురయ్యారు. ఎటు వంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.కందుకూరు డివిజన్ లో ఉన్న అన్ని మండలాల్లో విస్తారంగా వర్షాలు కురిసాయి.




**గుడ్లూరు :**బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిన కారణంగా గత నాలుగు రోజులుగా మండలంలో జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలు లేక పూర్తిగా ఎండిపోయిన ఉప్పుటేరికి ఎట్టకేలకి వర్షపు నీరు రావడంతో మంగళవారం ఉదయం నుంచి ఏటిలో వర్షపు నీరు ప్రవహిస్తుంది. నీటి ప్రవాహం పెరుగుతూ ఉండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## వైసిపి శవరాజకీయాలు మానుకోవాలి

**ప్రజాశక్తి-కందుకూరు :** కందుకూరు నియోజక వర్గంలోని దారకాణిపాడు ఘటన లో మృతిచెందిన లక్ష్మీ నాయుడు కుటుంబానికి మానవతా దక్పథంతో పెద్ద ఎత్తున సాయం అందించిన కూటమి ప్రభుత్వ పెద్దలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు, మంత్రులు అనిత, నారాయణ కు,ఎంఎల్ఏ ఇంటూరి నాగేశ్వరరావు కు తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్ ఒ ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. ఈ ఘటనపై జగన్‌రెడ్డి మనుషులు శవ రాజకీయాలు చేయడం సరికాదన్నారు. ఈకేసులో నిందితులకు శిక్ష పడేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుం టుందన్నారు. దీనిపై వైసిపి నాయకులు రాజకీయం చేయడం మానుకోవాలని హితవు పలికారు.

## 24 డిప్యూటీ స్పీకర్ రాక

**ప్రజాశక్తి-నెల్లూరు :**ఈనెల 24న డిప్యూటీ స్పీకర్ కె. రఘురామకష్ణ రాజు జిల్లాకు రానున్నట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నెల 24న ఉదయం తిరుమల నుండి ఉదయం 8.00 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి కనుపర్తిపాడులో ఉన్న వి పి ఆర్ కన్వెన్షన్ సెంటర్ కు ఉదయం 10.30 గంటలకు చేరుకుంటారు. అనంతరం ఉదయం 11.30 గంటలకు బయలుదేరి తాడేపల్లి కు చేరుకుంటారని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**గుడ్లూరు రూరల్ :**అల్ప పీడనం వల్ల రాబోయే 4 రోజుల్లో అనగా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో గుడ్లూరు మండల తహశీల్దార్ శ్రీనివాసులురెడ్డి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదుల చేశారు. వర్షాల కారణంగా అనుకోని సంఘ టనలు జరిగితే సాయం కోసం కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయాలని సూచిం చారు.8712622674, 9542485563 కంట్రోల్ రూమ్‌వి అని తెలిపారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాశక్తి-బిట్రగుంట :** ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన కారణంగా ఏర్పడిన అల్ప పీడనం వలన 21 నుండి 25వ తేదీ వరకు ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, మండలంలోని అన్ని గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ సానా శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రజలు అవసరమైతే తప్ప ఇంటి నుండి బయటకు రావొద్దని, వర్షాలు పడే సమయంలో చెట్ల కింద, బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదని, పిడుగులు పడే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని, మండలంలో ఏవైనా అనుకోని సంఘటనలు జరిగినచో సహాయం కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, సహాయం కోసం నెంబర్లు 9989931790, 8247338042 ఫోన్ చేయాలని తెలిపారు.

## ఎంఎల్ఎ సహకారంతో సిఎంఆర్ఎఫ్



**ప్రజాశక్తి-బిట్రగుంట :** కావలి శాసనసభ్యులు దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి సహకారంతో మంగమూరు గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలకు సిఎం రిలీఫ్ ఫండ్ అందజేశారని ముంగమూరు గ్రామ టిడిపి సీనియర్ నాయకులు ఎన్నాబత్తిన వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బోగోలు మండలం ముంగమూరు గ్రామానికి చెందిన హార్ట్, కిడ్నీ ఆపరేషన్ చేయించుకున్న మహిళలకు మంగళవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును కావ్య కృష్ణారెడ్డి చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు ఎన్నాబత్తిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ముంగమూరు గ్రామం చెందిన గుడిపల్లి విజయలక్ష్మికి హార్ట్ స్ట్రోక్ రావడంతో చెన్నైలోని ప్రయివేట్ హాస్పిటల్‌కు తీసుకొని వెళ్లి ఆపరేషన్ చేయించారని, హాస్పిటల్లో ఆమెకు ఖర్చు రూ.1,80,000 అయ్యిందని, సిఎం రిలీఫ్ ఫండ్ రూ.83,600 చెక్కును తీసుకున్నారని తెలిపారు. గిరిజన కాలనీకి చెందిన మహిళకు కనీసం ఆధార్ కార్డు కూడా లేని గిరిజన మహిళకు కిడ్నీ సమస్య రావడంతో ప్రయివేటు హాస్పిటల్లో చూపించుకున్నారు. వారికి ఆపరేషన్‌కు రూ.56వేలు ఖర్చయిందని, ఆమె సిఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.19వేల చెక్కును తీసుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ముంగమూరు గ్రామంలోని ప్రతి సమస్యను తీర్చుతున్న కావలి శాసనసభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

## బయో రీసోర్స్ సెంటర్ ప్రారంభం



**ప్రజాశక్తి-మర్రిపాడు :** మండలంలోని ఖాదర్ పూర్‌లో ఏపిసిఎన్ఎఫ్ రైతు సాధికారసంస్థ సహకారంతో ప్రకృతి వ్యవసాయంలో వాడు కషాయాలను అందించే బయో రీసోర్స్ సెంటర్‌ను మాస్టర్ ట్రైనర్ రామ్మోహన్ రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రకృతి వ్యవసాయంపై మొగ్గ చూపిందన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల పెట్టుబడులు తగ్గి అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జ్, బాలకిషోర్ సర్పంచ్ కృష్ణారెడ్డి, సిడిఎమ్ వెంకట్రావు, ఎల్టు బి.రవి, దుద్దుగుట్ట కుమారి, ఎల్ క్రీ నవ్య, వెంకట సుధా, గ్రామస్తులు రైతులు పాల్గొన్నారు.

## సిబ్బందికి యూనిఫారం బహూకరణ

**ప్రజాశక్తి-కావలి :** ఆర్‌టిసిలో బస్సులను, బస్టాండ్ ప్రాంగణాన్ని పరిశుభ్రం చేసే కార్మికులు, సరుకు రవాణా (కార్గో) విభాగంలో పనిచేసే సిబ్బంది, హమాలీలు ఏపిఎస్ ఆర్‌టిసికి గుండెకాయ వంటివారని ఏపిఎస్ ఆర్‌టిసి నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన కావలి డిపో బస్టాండ్, గ్యారేజ్‌లో పొరుగుసేవల ద్వారా పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు, కార్గో, మెకానికల్ సిబ్బందికి రెయిన్ కోట్లు, సమదుస్తులు బహూకరించారు. ఏపిఎస్ ఆర్‌టిసి, కావలి డిపో మేనేజర్ డి.ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) ఎం.కల్పన, అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానికల్) మల్లికార్జున, జిల్లా టెలికామ్ బోర్డు సభ్యులు కె బ్రహ్మానందం, బెల్లంకొండ మాల్యాద్రి ప్రసంగించారు. ఆర్‌టిసి సిబ్బంది ఎం.రామకృష్ణ (సీనియర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్), డి రవిప్రకాష్ (ఎడిసి), జలదంకి ఎంపిటిసి కె.మాధవరావు, నాయకులు కంచర్ల మురళీకృష్ణ, పివి రంగారెడ్డి, సివిసి సత్యం, పులిమి మాధవి రెడ్డి, మందా కిరణ్ కుమార్, పరసు వెంకటేశ్వర్లు, గుడిపల్లి ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



**ప్రజాశక్తి-కావలి :** పట్టూరి గోపాల కృష్ణయ్య వీధి బడిలో 70సంవత్సరాల క్రితం ఒకటవ తరగతి నుండి 5వ తరగతి 1955-60 చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక కార్యక్రమం కావలి పట్టణంలోని సాయిబాబా గుడి ఆవరణలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ 70 సంవత్సరాల క్రితం చదువుకొని, ఇప్పటికీ సన్నిహితంగా ఉండటం గర్వకారణమన్నారు. ఈ సమయంలో కలవడం, ముఖాలలో ఆనందాలు చూస్తుంటే తనకు కూడా అలాంటి కార్యక్రమాలు చేయాలని ఉందన్నారు. నేటి యువతకు మీరు స్ఫూర్తి అని వారిని కొనియాడారు. పూర్వ విద్యార్థులు తాము తమ కుటుంబ సభ్యులను పరిచయం చేశారు. వారి చిన్ననాటి ముచ్చటలతో వారి అనుభవాలను పంచుకున్నారు. విందు భోజనంతో సహపంక్తి రంజింప చేయడంలో అందరూ తమ హాస భావాలతో సభను రక్తి కట్టించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మట్ట కొండయ్య, షేక్.రసూల్ బాషా, ఉప్పల శ్రీనివాసులు, గాదిరాజు లక్ష్మీనరసింహారావు, ఉంగుటూరి శివప్రసాద రావు, వెంకటేశ్వర్లు, పొన్నూరు గురవయ్య, ఐనముడిగ శివరామిరెడ్డి ఐలింద గురునాథం, ఎర్రగుంట చంద్రశేఖర్ రెడ్డి, వీరిశెట్టి పెద్దన్న, తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల డిమాండ్లపై సిఎం స్పందన హర్షణీయం

**- ఏపి ఎన్‌జిఒ ప్రెసిడెంట్ ఎస్.శివకుమార్**



**ప్రజాశక్తి-కావలి :** దీపావళి కానుకగా నవంబర్ నుంచి ఒక డి.ఎ.ను విడుదల చేయడం, 60 రోజుల్లో హెల్త్ కార్డుల వ్యవస్థను సక్రమంగా నడిపించేందుకు కమిటీని ఏర్పాటు చేసి ఇన్సూరెన్స్ విధానాన్ని పరిశీలించాలని ఆదేశించడం, ఆర్‌టిసి ఉద్యోగుల ప్రమోషన్లపై వారం రోజుల్లో ఉత్తర్వులు జారీ చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడంపై ఏపి ఎన్‌జిఒ, ఏపి జెఎసి నాయకులు ఎస్.శివకుమార్ హర్షం వ్యక్తం చేశారు. దీపావళి పండుగకు ముందే ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించడం, ముఖ్యమంత్రితో, గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్‌తో జరిగిన స్నేహపూర్వకమైన, గౌరవప్రదమైన, పారదర్శక చర్చలు దాదాపు ఐదు సంవత్సరాల తర్వాత ఈ స్థాయిలో జరగడం సంతోష దాయకమని వారు పేర్కొన్నారు. చైల్డ్ కేర్ లీవ్‌పై ముఖ్యమంత్రి చేసిన ప్రకటన మహిళా ఉద్యోగుల్లో ఆనందాన్ని నింపిందని తెలిపారు.


## సరుకుల పంపిణీలో అలసత్వం తగదు..

**ప్రజాశక్తి-కోవూరు :** మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన రేషన్ షాపు డీలర్లు సరుకుల పంపిణీలో అలసత్వం లేకుండా సకాలంలో వాటిని కార్డుదారులకు అందించేలా తగు చొరవ తీసుకోవాలని తహశీల్దార్ సిహెచ్ సుబ్బయ్య అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన చౌక డిపో డీలర్లతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహశీల్దార్ బాలకోటయ్య, డిప్యూటీ తహశీల్దార్ బిషప్ పలు సూచనలు చేశారు.కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనాథ్, రేషన్ డీలర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## సర్వేను పారదర్శకంగా నిర్వహించాలి

**ప్రజాశక్తి-కోవూరు :** జిల్లా వ్యాప్తంగా నవంబర్ 17 నుంచి 31 వరకు నిర్వహిస్తున్న ఎల్సీడీసీ సర్వేను ఒక ప్రణాళికాబద్ధంగా నిర్వహించేలా ఆశా, ఆరోగ్య సిబ్బంది, సూపర్‌వైజర్లు ప్రత్యేక చొరవతీసుకోవాలని జిల్లా టీబీ, క్షయ, ఎయిడ్స్ నివారణ అధికారి ఎస్‌కె ఖాదర్‌బాషా అన్నారు. కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సలావుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లు దగ్ధం



**ప్రజాశక్తి-కోవూరు :** కోవూరులోని లైబ్రరీ సెంటర్ ప్రాంతంలో మంగళవారం ఉదయం అగ్నిప్రమాదం సంభవించింది. స్థానిక మహిళ వంగపాటి మాధవి దేవునికి దీపారాధన చేస్తుండగా, ప్రమాదవశాత్తు దీపం కిందపడటంతో మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు రేకులతో నిర్మించిన ఇంటిని ఆవరించాయి. స్థానికులు వెంటనే అప్రమత్తమై మంటలను ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ, ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంటిలో ఉన్న వస్తువులు, గృహోపకరణాలు పూర్తిగా కాలిపోయినట్లు సమాచారం. అదృష్టవశాత్తు ప్రాణనష్టం సంభవించలేదు.

## మేఘనకు ఎంఎల్ఎ పరామర్శ



**ప్రజాశక్తి-కలిగిరి :** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయాలై నెల్లూరులోని కిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న చవలమూడి మేఘనను ఎంఎల్ఎ కాకర్ల సురేష్ మంగళవారం పరామర్శించారు. వైద్యులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. పాపకు అన్ని విధాలుగా అండగా నిలుస్తానని తెలిపారు. ప్రభుత్వం ద్వారా మృతుల కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తానన్నారు. బోర్‌వెల్స్ లారీ ద్వారా ఇన్సూరెన్స్ క్లైమ్ చేయించి, ఇన్సూరెన్స్ వచ్చేలాగా చూస్తానని తెలిపారు.

# డివిజన్‌స్థాయి ఆటల పోటీలు ప్రారంభం

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్**

ఆత్మకూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఆత్మకూరు డివిజన్ స్థాయి ఆటల పోటీలు మంగళవారం ప్రారంభించారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆత్మకూరు డివిజన్ పరిధిలోని 9 మండలాలకు చెందిన క్రీడాకారులకు ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. అండర్-14, అండర్ -17 విభాగాల్లో క్రీడాకారులకు వాలీబాల్, చెస్, యోగా విభాగాల్లో పోటీలు నిర్వహించారు. అందులో క్రీడల నిర్వహణతో పాటు 25వ తేదీన జిల్లాలో జరిగే జిల్లాస్థాయి పోటీలకు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి

ఎంపిక చేసే కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తారు. మంగళవారం ఈ క్రీడా పోటీలను స్థానిక 20వ వార్డు కౌన్సిలర్ సురా భాస్కర్ రెడ్డి క్రీడాకారులతో కరచాలనం చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములతో సంబంధం లేకుండా తమ ప్రావీణ్యాన్ని చూపించాలన్నారు. అనంతరం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి బివి రమణయ్య, ఎస్ఆర్‌జె డిగ్రీ కళాశాల పిడి సిరిమామిళ్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాస్థాయిలో 25న జరగబోయే క్రీడలకు ఎంపిక ప్రక్రియ కూడా ఉంటుందన్నారు. కార్యక్రమంలో 20వ వార్డు టిడిపి ఇన్చార్జ్ చిన్నబ్బాయి, మర్రిపాడు ఎంఇఒ తిరుపతయ్య, గేమ్స్ పర్యవేక్షకులు మహేష్, ఆత్మకూరు ఉన్నత పాఠశాలతో పాటు 9 మండలాల పీడీలు హాజరయ్యారు.

## నీట మునిగిన వరిపంట పరిశీలన





**ప్రజాశక్తి-అనంతసాగరం :** మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు కోతకు వచ్చి నీటమునిగిన వరి పంటను మంగళవారం వ్యవసాయ అధికారిణి ఈ.శైలజకుమారి పరిశీలించారు. మండలంలోని పాతాళపల్లిలో 300ఎకరాలు, ఉప్పలపాడు 550ఎకరాలు, చిలకలమర్రి 200 ఎకరాలు, సోమశిల 25ఎకరాలు, అనంతసాగరం 30ఎకరాలు, పీకేపాడు 200ఎకరాలు అదేవిధంగా సజ్జ 10ఎకరాలు, పాతాళపల్లిలో వేరుశెనగ 6ఎకరాలు పంటనష్టం ప్రాథమిక అంచనాలు వేశారు. ఆమెవెంట ఎఇఒ కృష్ణవేణి, విఎఎలు సుబ్బయ్య, జ్యోత్స్న, రైతులు ఉన్నారు.

# మాలేపాటి మృతి తీరని లోటు..

**- నివాళులు అర్పించిన ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి**

**ప్రజాశక్తి-కావలి**

రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు మాలేపాటి సుబ్బానాయుడు మరణం టిడిపికి తీరని లోటు అని కావలి ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. మాలేపాటి సుబ్బానాయుడు, దగదర్తి మండల టిడిపి యువ నాయకుడు మాలేపాటి భానుచందర్ స్మారకార్థం సోమవారం కావలి పట్టణంలోని ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన సంస్మరణ కార్యక్రమంలో కావలి ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్‌గా 2022 నుండి 2024 వరకు సుబ్బానాయుడు ఎంతో నిబద్ధతతో పనిచేశారన్నారు. ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉండి పార్టీని బలోపేతం చేయడంలో విశేష కృషి చేశారన్నారు. ఆయన అకాల మరణం కావలి నియోజకవర్గానికి మాత్రమే కాకుండా, నెల్లూరు జిల్లా టిడిపికి తీరని లోటన్నారు. ఆయన మరణం పార్టీ కార్యకర్తలందరినీ దుఃఖంలో ముంచేసిందన్నారు. తన ఆరోగ్యం బాగోలేక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలోనే సుబ్బానాయుడు సోదరుని కుమారుడు భానుచందర్



నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ, టిడిపి నేతలు

కూడా అనారోగ్యంతో చికిత్స పొందుతూ మరణించడం హృదయ విదారకమని ఎంఎల్ఎ పేర్కొన్నారు. యువ నాయకుడిగా ఎదుగుతున్న బానుచందర్ భవిష్యత్తులో పార్టీకి అద్భుతమైన నాయకత్వం చూపు తాడని అందరూ నమ్మిన సమయంలో ఆయన అకాల మరణం దగదర్తి మండలానికి తీరని లోటని తెలిపారు. సుబ్బానాయుడు సేవలను గుర్తించి పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారని, రాష్ట్రవ్యాప్తంగా ఆయన సేవలను వినియోగించుకోవాలని చంద్రబాబు భావించారన్నారు. ఈ సంస్మరణ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున హాజరై పుష్పాంజలి ఘటించారు.



మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

# యుటిఎఫ్ సభ్యత్వ నమోదు

**ప్రజాశక్తి-అనంతసాగరం**

మండలంలో మెగా డి.ఎస్.సి 2025 ద్వారా మండలంలోని వివిధ పాఠశాలల్లో నూతనంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న 19మంది ఉపాధ్యాయులను ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సభ్యులుగా నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. వారికి వృత్తి పరమైన సమస్యలపై అవగాహన కల్పించారు. అధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ అసంబద్ధమైన డి.ఎ. జి.ఒ 61,62 లను మార్పు చేసి డి.ఎ.అరియర్స్‌ను పి.ఎఫ్. ప్రాన్ ఖాతాలలో జమ చేయునట్లు జి.ఒ.లను విడుదల చేయాలని, పి.ఆర్.సి. కమిటీ వేసి ఐ.ఆర్.ను వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి సాధిక్ మాట్లాడుతూ బోధనేతర యాప్‌ల నుండి టీచర్లుకు విముక్తి కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో యు.టి.ఎఫ్. నాయకులు నాయబ్ జాని, మహేష్, రంతుల్లా, అల్తాఫ్ భగత్‌లు పాల్గొన్నారు.

## టిఎ, డిఎ బిల్లులను విడుదల చేయాలి

**ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్**

ఉద్యోగస్తులకు ఇవ్వాల్సిన పెండింగ్‌లోని టిఎ, డిఎ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఎంఎల్‌సి పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక రామ్‌జీ నగర్‌లోని వైఎస్‌ఆర్‌సిపి సిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దీపావళికి రెండు రోజులు ముందు స్వయాన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉద్యోగ సంఘాల నాయకులతో రెండు రోజులపాటు ఎడతెరిపి లేకుండా సమావేశాలు జరిపారన్నారు. ఈ తంతు చూసిన ప్రతి ఒక్క ఉద్యోగస్తుడు పెండింగ్ లో ఉన్న టి ఎ, డి ఎ బిల్లులను విడుదల చేయబోతున్నారని ఆశపడిన ఉద్యోగస్తుల ఆశలపై నీళ్లు జల్లుతూ 1 టిఎ బిల్లును విడుదల చేస్తున్నట్టు ప్రకటించి పండుగ చేసుకోమనడంపై ఉద్యోగస్తులు అందరూ నివ్వెర పోయారన్నారు. రాష్ట్ర ఉద్యోగస్తుల పట్ల చంద్రబాబు అవలంబిస్తున్న నిర్లక్ష్య ధోరణిని ఆయన తప్పు పట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్నా ఆరు నెలలకు ఒకసారి ఇవ్వాల్సిన డిఎలను ఇవ్వకుండా రాష్ట్రం వద్ద నిధులు కొరతగా ఉన్నాయన్న సాకుతో పెండింగ్లో పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఉద్యోగస్తులకు రావాల్సిన డిఎలను రిటైర్డ్‌మెంట్ రోజున తీసుకోమని కొత్త సాంప్రదాయానికి తెరతీశారని, వైసిపి ఈ సంప్రదాయాన్ని ఖండిస్తూ దానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తా మన్నారు. ఉద్యోగస్తులకు రావాల్సిన పిఆర్సి కమిషన్‌ను అనౌన్స్ చేయాలని, ఐఆర్ ని 30 శాతానికి తగ్గకుండా విడుదల చేయాలని, రాబోవు రోజుల్లో పోరాటాలకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.



పొలాల్లో పడిన బస్సు

# ఆర్‌టిసి బస్సు బోల్తా..

**- డ్రైవర్ అప్రమత్తతో తప్పిన పెనుప్రమాదం**

**ప్రజాశక్తి-జలదంకి**

జలదంకి మండల పరిధిలోని కావలి - ఉదయగిరి రోడ్డు ఉదయగిరి రోడ్డు తొమ్మిదో మైలు సమీపంలో ఆర్‌టిసి బస్సు బోల్తా పడిన సంఘటన మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రాణప్రాయం లేకుండా ప్రయాణికులంతా చిన్నచిన్న గాయాలతో బయటపడ్డారు. వివరాల మేరకు.. కావలి నుంచి ఆర్‌టిసి బస్సు చామదల గ్రామానికి వెళుతుంది. జలదంకి దాటి వీరాంజనేయ పాల డెయిరీ సమీపానికి వచ్చే సమయంలో ఎదురుగా వస్తున్న లారీ ఒక్కసారిగా ఆర్‌టిసి బస్సు పైకి రావడంతో అప్రమత్తమైన డ్రైవర్ బస్సును పొలాల్లోకి దింపాడు. ఈ క్రమంలో బస్సులో ఉన్న 10మంది ప్రయాణికులు అద్దాలు పగలగొట్టుకొని బయటపడ్డారు. ఎటువంటి ప్రాణహాని జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## మాలేపాటి మృతి బాధాకరం

**ప్రజాశక్తి-ఉదయగిరి**

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏపి అగ్రోస్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు మృతి తీరని లోటు అని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జెడ్‌పి మాజీ చైర్మన్ పి.చెంచలబాబు యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన భౌతిక కాయం వద్ద శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించి సుబ్బానాయుడు లేని లోటు పేద ప్రజలకు తీరని లోటని వారి ఆత్మకు శాంతి కలగాలని కోరారు. జొన్నలగడ్డ రామా నాయుడు పరిచయంలో ఏప్పుడు ఎవ్వరు కలిసిన ఆప్యాయంగా మాట్లాడేవారని చైర్మన్ అయిన కూడా ఆ ప్యాయంగా గర్వం లేని వ్యక్తి సుబ్బనాయుడు మృతి చెందడం ఎంతో బాధాకరమని, ఇలాంటి సమయంలో వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యంగా ఉండాలని కోరుకొంటున్నామన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

**ప్రజాశక్తి-మర్రిపాడు**



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

మండల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన నాగినేనిగుంట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ మునాఫ్, సింగన పల్లి ఉర్దూ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సబిహాలను నాగినేని గుంట పాఠశాలలో సహచర ఉపాధ్యాయులు, గ్రామస్తు లు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భం గా జరిగిన కార్యక్రమంలో ఎంఇఒ-1 తిరుపతయ్య మాట్లాడుతూ ఇరువురు ఉపాధ్యాయులు అత్యున్నత బోధనతో, నాణ్యమైన విద్యను అందిస్తూ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికవడం అభినందనీయమన్నా రు. కార్యక్రమంలో ఎంఇఒ-2 ధనలక్ష్మి, కదిరినాయుడుపల్లి క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు రవీంద్ర, విశ్రాంత ఎంఇఒ జొన్నా సత్యనారాయణ, క్లస్టర్ సెక్రటరీ విజయభాస్కర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి రంతు, నాగినేని గుంట పాఠశాల చైర్మన్ హజరత్, మహిమలూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇస్మాయిల్, బంధుమిత్రులు పాల్గొన్నారు.



గురుకులంలో దీపావళి వేడుకలు నిర్వహిస్తున్న కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి

# గురుకులంలో దీపావళి వేడుకలు

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్**

విద్యార్థినుల కళ్ళల్లో ఆనందం తమకి ఎంతో సంతోషాన్ని కలిగించిందని ఆత్మకూరు కౌన్సిలర్లు అన్నారు. సోమవారం ఆత్మకూరు పట్టణంలోని బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులతో కలిసి దీపావళి పండుగను చేసుకునేందుకు 20వ వార్డు కౌన్సిలర్ సూరా భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక రెండవ వార్డు కౌన్సిలర్ శివకోటరెడ్డి తోపాటు కౌన్సిలర్లు కొప్పోలు రమాదేవి, గండ్ల వేణు, ఎం.రాజశేఖర్, పొడ మేకల పెంచలయ్య గురుకుల పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ బాలకృష్ణ తదితరులు హాజరయ్యారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రూత్ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు పలు రకాల దీపావళి టపాసులు, స్వీట్స్, చాక్లెట్స్ విద్యార్థులకు పంపిణీ చేశారు. పాఠశాలలోని అన్ని తరగతుల విద్యార్థులు కళాశాల ఆవరణంకు చేరుకొని ఈ దీపావళి సంబరాలలో పాల్గొన్నారు. సూరా భాస్కర్ రెడ్డితో పాటు మిగిలిన కౌన్సిలర్లు విద్యా కమిటీ చైర్మన్ పాఠశాల ప్రిన్సిపాల్ తదితరులు విద్యార్థులతో కలిసి దీపావళి పండుగ సంబరాలను ఎంతో ఘనంగా సంతోషంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు సురా భాస్కర్ రెడ్డి, రమాదేవి మాట్లాడుతూ ఇంటికి దూరంగా ఉండి ఈ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులతో కలిసి దీపావళి పండుగ సంబరాలను నిర్వహించడం తమకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. పండగ రోజు తమకు దీపావళి టపాసులను అందించి స్వీట్లు పంచి తమతో సంతోషంగా గడిపిన గ్రామపెద్దలు పట్టణంలోని వివిధ వార్డుల మున్సిపల్ కౌన్సిలర్లకు ఇక్కడి విద్యార్థులు, ప్రిన్సిపాల్ ధన్యవాదాలు తెలిపారు. ఆత్మకూరు పట్టణ 20వ వార్డు కౌన్సిలర్ సురా.భాస్కర్ రెడ్డి ఏది చేసినా వెరైటీగా ఉంటుంది అందుకు ఈ కార్యక్రమమే మరో నిదర్శనం..

## చెరువులను తలపిస్తున్న రహదారులు

**ప్రజాశక్తి-బిట్రగుంట**



సోమవారం రాత్రి కురిసిన వర్షానికి కప్పురాల తిప్ప నుండి బోగోలు బజాజ్ సెంటర్‌కు వచ్చే ప్రధాన జాతీయ రహదారిలో గుంతల్లో నీరుచేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బోగోలు బజారు వాటర్ సర్వీస్, సితార వైన్ షాప్ ముందు ఉన్న రోడ్డు, 144 రైల్వే గేటు పడమర వైపు ఉన్న రఘురామిరెడ్డి ఎలక్ట్రికల్ షాపు, లక్ష్మీ స్వీట్ అంగడి ముందు, రెడ్డమ్మ టీ స్టాల్ అంగడి ముందు ఉన్న రోడ్డులో గుంటలు పడి వర్షపు నీరు చేరి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే రోడ్డుపై నడిచే పరిస్థితి లేదని, ప్రజలు వాపోతున్నారు. జాతీయ రహదారిన వచ్చే పాదచారులకు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆటో కార్మికులు వాహనదారులు గుంతల్లో పడి వాహనాలు తొందరగా చెడిపోతున్నాయని ఆటో కార్మికులు తెలిపారు. రాజకీయ నాయకులు, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# ఎఎస్‌పేటలో జోరువాన

**ప్రజాశక్తి-ఎఎస్‌పేట**



మండలంలోని పలు ప్రాంతాల్లో భారీవర్షం కురిసింది. మండల కేంద్రమైన ఎఎస్‌పేటలో వాగు పారం బోకు స్థలంలో నిర్మించుకున్న ఇంటి చుట్టూరా నీరు చేరడంతో, ఆయా పక్క ప్రదేశాల్లో నివాసితుల ప్రాంతాలలో కూడా నీరు చేరడం జరిగింది. అటువైపు వెళ్లి రోడ్లపై కూడా నీరు రావడం, పోలీస్ స్టేషన్ సచివాలయ పరిధిలోని పలుచోట్ల చెట్లు రోడ్డుపైకి కూలి, మోడల్ స్కూలు, మండల ఆఫీసు, పోలీస్ స్టేషన్ తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనదారులకు కొంచెం సేపు ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడడం జరిగింది. అంతేకాకుండా ఉదయం సుమారు తెల్ల వారు జామున మూడు గంటల నుంచి ఉదయం 9 గంటల దాకా కరెంటు లేకపోవడంతో, ప్రజలకు సెల్ఫోన్లో ఛార్జింగ్ కూడా లేకుండా పోవడం, తీవ్ర ఇబ్బంది కలగడం, పలు హోటల్ యజమానులు, పాల ఉత్పత్తిదారులకు కరెంటు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

## వీధుల్లో నిలిచిన వర్షపునీరు

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్**



నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ధోరణి ప్రభావంతో కురుస్తున్న వర్షం కారణంగా ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని పలుచోట్ల రోడ్లమీద నీరు భారీగా నిలిచింది. మున్సిపల్ పరిధిలోని 22వ వార్డు చేనేత, పేరారెడ్డిపల్లి బీసీ కాలనీ ప్రాంతాలలో రోడ్లపై నీళ్లు నిలిచి పోవడంతో స్థానికులు ఇబ్బంది పడిన పరిస్థితి నెలకొంది. స్థానిక మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, అవార్డు కౌన్సిలర్ మాదాల శ్రీనివాసులు నాయుడు చేరుకొని పరిశీలించి జెసిబి యంత్రంతో అక్కడ నీరు నెల్లూరు - ముంబై రహదారిపైకి మళ్లించేలా చర్యలు తీసుకున్నారు.

## మున్సిపాలిటీలో కాల్ సెంటర్ ఏర్పాటు

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ :** ఆత్మకూరు మున్సిపాలిటీ పట్టణ పరిధిలో తీవ్ర వర్షాలు కురుస్తూ ఉండడంతో అన్ని ప్రాంతాలలో ఏవైనా సమస్యలు తలెత్తితే మున్సిపాలిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ సంబంధించి ఇక్కడ తెలుపుతున్న ఫోన్ నెంబర్ 08627220385కు ఫోన్ చేసి సమస్య తెలియపరచాలని మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ తెలియపరిచారు. జిల్లా కలెక్టర్ వారి ఆదేశాలతో మున్సిపాలిటీ కార్యాలయంలో ఈ కాల్ సెంటర్ ఏర్పాటు చేశారు.

## ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాశక్తి-కోవూరు :** కోవూరులోని పూనూరు వారి వీధిలో మంగళవారం ఉదయం విషాద ఘటన చోటు చేసుకుంది. స్థానికంగా నివాసముంటున్న బైన రాజగోపాల్ (46) కుటుంబ కలహాల నేపథ్యంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న కోవూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## సంగం బ్యారేజీ పరిశీలన

**ప్రజాశక్తి-సంగం :** సంగం బ్యారేజీని సిఐ వేమారెడ్డి, ఎస్ఐ రాజేష్ సందర్శించారు. బ్యారేజీ వద్ద వరద ప్రవాహాన్ని పరిశీలించారు. సోమశిల నుండి పెన్నా బ్యారేజీకి వరదనీరు విడుదల చేయడంతో బ్యారేజీ దిగువన ఉన్న పెన్నా పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరద నీరు అధికంగా వస్తుండటంతో మత్స్యకారులు, పశువులు మేపుకునే వారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

## మూడు నెలలుగా అందని జీతాలు..!

**- ఇబ్బందుల్లో కిందిస్థాయి ఉద్యోగులు..**

**ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు**

మూడు నెలల నుంచి జీతాలు అందక.. జీవితాలు గడవక పంచాయతీ కింది స్థాయి సిబ్బంది ఆర్థికంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. వివరాల్లోకి వెళితే.. తోటపల్లిగూడూరు మండలం, కోడూరు మేజర్ పంచాయతీ సచివాలయం ఉద్యోగులు గత మూడు నెలల నుంచి జీతాలకు నోచుకోవడం లేదు. దాంతో ఆర్థికంగా వారు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఈ సచివాలయంలో ఎలక్ట్రిషియన్, ప్లంబర్, నిచ్చెన హెల్పర్, పంపు ఆపరేటర్, స్వీపర్స్ తదితరులు మొత్తం 10 నుంచి 14 మంది వరకు కింది స్థాయి సిబ్బంది విధులు నిర్వహిస్తోంది. వీరికి నెలకు రూ.80వేల నుంచి రూ.90 వేల వరకు జీతాలు చెల్లించాల్సి ఉంది. కారణం ఏమిటో తెలియదు గానీ ఏకంగా గత మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం గమనార్హం. దాంతో తాము ఆర్థికంగా అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు వారు వాపోతున్నారు. గత మూడు నెలలుగా జీతాలు అందని కారణంగా గడిచిన దసరా, మరో మూడు రోజులలో రానున్న దీపావళి పండగలో పస్తులు ఉండాల్సిన పరిస్థితులు దాపురించాయని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ఒక్కసారి కూడా సమయానికి జీతాలు ఇచ్చిన దాఖలాల్లేవని ఉద్యోగులు ఆరోపిస్తు న్నారు. ప్రతి నెలా 5-10 వ తేదీ లోపల వేతనాలు చెల్లించాల్సి ఉన్నా ఒక్క నెల కూడా సమయానికి జీతాలు పంపిణీ కావడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకొని యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకొని పెండింగ్ జీతాలు వెంటనే విడుదల చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు.

# 23న ఇంటర్వ్యూలు

**ప్రజాశక్తి - ఉదయగిరి :** 23వ తేదీన పలు కంపెనీలకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని నిరుద్యోగ యువతీ యువకులు సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని టిడిపి మండల అధ్యక్షులు చింతనబోయిన బయన్నయాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 23వ తేదీ గురువారం స్థానిక ఎస్‌ఎంజిఆర్ అగ్రికల్చరల్ కళాశాల ప్రాంగణంలో పలు కంపెనీలు, వారి మేనేజర్లతో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఆసక్తి కలిగిన యువకులు https://nai punyam. ap.gov.in/user registration వెబ్‌సైట్ లింక్‌లో పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. పదవ తరగతి పైబడి చదివిన 18 నుండి 39 సంవత్సరాల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## పోలీస్ అమరవీరులకు జోహార్లు..

**ప్రజాశక్తి-ఉదయగిరి**



పోలీస్ అమరవీరులకు మేకపాటి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ మేకపాటి రాజగోపాల్ రెడ్డి జోహార్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో ప్రాణాలొడ్డి పోరాడిన పోలీస్ అమరుల సేవలను జాతి ఎప్పటికీ మరువదు అమరుల స్ఫూర్తితో పోలీసు ఉద్యోగులు తమ విధి నిర్వహణకు పునరంకితం కావాలని ఆకాంక్షిస్తూ, విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరులకు సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఘన నివాళులర్పించామన్నారు. ముఖ్యంగా నియోజకవర్గ ప్రజలు విస్తారంగా కురుస్తున్న వర్షాలపై అప్రమత్తంగా ఉండండి అత్యవసరమైతే తప్ప ఎవ్వరు ఇంటి నుండి బయటకి రాకూడదని కోరారు. తుఫాను హెచ్చరికలు నేపథ్యంలో నియోజకవర్గంలోని 8 మండలాలలో విస్తారంగా కురుస్తున్న వర్షాలపై నియోజకవర్గం ప్రజలు అందరు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. విస్తారం గా కురుస్తున్న వర్షాలతో పాడి రైతులు, అన్నదాతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలందరు దృఢమైన భవనాలలో ఉండాలని పెచ్చులూడిన స్లాబ్ లు ఇతర గుడిసెలు లోతట్టు ప్రాంతం ప్రజలు సురక్షిత ప్రాంతాలలో ఉండాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయం చేసేందుకు వైసిపి నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండాలని పిలుపునిచ్చారు.

## లైన్‌మెన్‌పై చర్యలు తీసుకోండి..

**ప్రజాశక్తి-జలదంకి**



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

విధులలో నిర్లక్ష్యం వహిస్తున్న లైన్‌మెన్ కిరణ్‌పై చర్యలు తీసుకోవాలని 9వ మైలు గ్రామానికి చెందిన పాలకీర్తి సులోచన మంగళవారం జలదంకి సబ్ స్టేషన్ ఎఇ సునీల్‌కు ఫిర్యాదు చేసింది. కావలి - ఉదయగిరి రోడ్డు మార్గంలో జలదంకి 9వ మైలు గ్రామాలకు మధ్యలో శ్రీ వీరాంజనేయ పాల డెయిరీ పరిసరాల్లోని పొలాల వద్ద థర్డ్ ఫేస్ విద్యుత్ లైను వైర్లు కిందకు వేలాడుతున్నాయి. ఈ విషయం గురించి పలుమార్లు లైన్‌మెన్‌కు విన్నవించినా స్పందించలేదన్నారు. లైన్మెన్ నిర్లక్ష్యం వల్ల తన పాడి బర్రెకు విద్యుత్ వైర్లు తగిలి షాక్కు గురై చనిపోయిందన్నారు. బర్రెను కాపాడే క్రమంలో తోటి పశువుల కాపరి రాగి సిద్ధార్థకు కూడా విద్యుత్ షాక్ తగిలి తీవ్రంగా గాయపడి హాస్పిటల్లో చికిత్స పొందుతున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. లక్ష రూపాయలు విలువ గల పాడి గేదె మృతి చెందిన, కరెంట్ షాక్ వల్ల సాటి వ్యక్తి గాయపడినప్పటికీ లైన్‌మెన్ ఇంతవరకు తమను పరామర్శించిన దాఖలాలు లేవన్నారు. ప్రజా సమస్యలపై అలసత్వం ప్రదర్శించే ఇలాంటి వారిపై కఠినమైనల చర్యలు తీసుకోవాలని ఆమె తన ఫిర్యాదులు పేర్కొంది. ఆమెవెంట వంటేరు రాకేష్ రెడ్డి తదితరులున్నారు.